సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



**ఘనంగా సీమంతాలు**
వీఆర్‌పురం ఎస్టీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు ఘనంగా నిర్వహించారు. 8లో




**పెన్షనర్ల పే రివిజన్‌కు కృషి**
పెన్షనర్ల పే రివిజన్‌కు తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావు పేర్కొన్నారు. 8లో



**అప్పన్న సన్నిధిలో 'అర్జున్‌రెడ్డి'**
సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారిని మంగళవారం హీరో విజయ్ దేవరకొండ దర్శించుకున్నారు.

## న్యూస్‌రీల్

### గవర్నర్ పర్యటన ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పీవో అభిషేక్

**అరకులోయ రూరల్:** అరకులోయలో ఈనెల 10న రాష్ట్ర గవర్నర్ పర్యటించనున్న నేపథ్యంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గవర్నర్ పద్మాపురం గార్డెన్లో ట్రీ క్యాస్టిల్, గిరిజన మ్యూజియాన్ని సందర్శిస్తారన్నారు. అనంతరం సుంకరమెట్ట కాఫీ ప్లాంటేషన్ పెదలబుడు గిరి గ్రామదర్శినిని తిలకిస్తారని పీవో పేర్కొన్నారు. అధికారులంతా బాధ్యతగా పనిచేసి గవర్నర్ పర్యటన విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, గిరిజనసంక్షేమ శాఖ ఈఈ వేణుగోపాల్, డీఈ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ మురళి, గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్ మేనేజర్లు మురళి, బొంజిబాబు పాల్గొన్నారు.

### బాలికపై లైంగికదాడి

- బాలుడు మరో ఇద్దరిపై కేసు

**వై.రామవరం:** మండలంలోని ఒక గ్రామానికి చెందిన బాలికపై మరో గ్రామానికి చెందిన బాలుడు ఈనెల మూడవ తేదీన లైంగికదాడికి పాల్పడ్డాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు పోక్సో చట్ట ప్రకారం కేసు నమోదు చేశారు. బాలుడితోపాటు అతనికి సహకరించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. రంపచోడవరం ఏఎస్పీ జగదీష్ అడహళ్లీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

### ఏకలవ్య పాఠశాలల్లో పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

**రంపచోడవరం:** రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో గెస్టు ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు రిటైర్డ్, జూనియర్ లెక్చరర్స్ నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఏకలవ్య పాఠశాలల్లో రెగ్యులర్ ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ జరుగుతుందని, అప్పటి వరకు ఇతర శాఖల ఉపాధ్యాయులు, రిటైర్డ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడం జరుగుందన్నారు. ఈ నెల 14లోగా దరఖాస్తులను మెయిల్ చేయాలని తెలిపారు. పూర్తి వివరాలను వై.రామవరం ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణను సంప్రదించాలని ఆయన కోరారు.

### రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ మూర్తి, కోచ్ రాజాబాబు

**అరకులోయ రూరల్:** రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు క్రీడా పాఠశాల నుంచి ఆదిత్య, వరుణ్, సూర్య, సాత్వితేజ్, మహీధర్‌దాష్ ఎంపికైనట్టు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, కోచ్ రాజాబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ఒంగోలులో అండర్-13 బ్యాడ్మింటన్ పోటీలకు ఈ నెల ఏడు నుంచి పదో తేదీ వరకు జరిగే పోటీలకు క్రీడా పాఠశాల నుంచి ఆరుగురు విద్యార్థులు పాల్గొంటున్నట్టు తెలిపారు.వారిని అభినందించారు.

### జోగుపుట్టు కొండల్లో రంగురాళ్ల తవ్వకాలు



రంగురాళ్ల కోసం తవ్వకాలు జరిపిన ప్రాంతం

**జి.మాడుగుల:** మండలంలో జోగుపుట్టు గ్రామ సమీపంలోని కొండల్లో గత మూడు రోజుల నుంచి గట్టుచప్పుడు కాకుండా రంగురాళ్ల తవ్వకాలు జరుగుతున్నట్టు తెలిసింది. నర్సీపట్నం పరిసర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు తవ్వకాలు జరుపుతున్నట్టు తెలుస్తోంది. దీనివల్ల ఏర్పడిన గోతులు ప్రమాదకరంగా మారాయి.

# ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, పక్కన ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పాడేరు ఎంఈవో రామచంద్రరావును సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ సేవలకు సత్కారం

**సాక్షి,పాడేరు:** ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో ఎనలేని గౌరవం, గుర్తింపు ఉందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని జిల్లాస్థాయిలో మంగళవారం స్థానిక కాఫీ అతిథి గృహంలో నిర్వహించారు. ముందుగా రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు జిల్లాను అగ్రగామిగా నిలిపేందుకు ఉపాధ్యాయులంతా ఎంతో శ్రమిస్తున్నారన్నారు. వారంతా అభినందనీయులన్నారు. గిరిజన ప్రాంత పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. నాడు–నేడు ద్వారా మరిన్ని పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు.అన్ని గ్రామాల్లో విద్యాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతానికి ఉపాధ్యాయులంతా అంకితభావంతో పనిచేయాలని కోరారు.ఉత్తమ ఉపాధ్యాయులందరూ తమ బాధ్యతను మరింత రెట్టింపు చేసుకుని విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు.

**టెన్త్‌లో మరింత మెరుగైన ఉత్తీర్ణత: ఐటీడీఏ పీవో అభిషేక్**

ఉపాధ్యాయులంతా గిరిజనుల విద్యకు శ్రమిస్తున్నారని టెన్త్‌లో ఫలితాల శాతం మరింత పెరగాలని పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ సూచించారు. డ్రాపౌట్ విద్యార్థులపై మరింత శ్రద్ధ పెట్టాలన్నారు. బడిఈడు పిల్లలంతా బడిలోఉండాలనే ఆశయంతో ఉపాధ్యాయులు పనిచేయాలని ఆయన కోరారు.

**మరిన్ని ప్రోత్సాహకాలు పొందాలి: డీఈవో సలీంబాషా**

ఉపాధ్యాయులంతా అంకిత భావంతో పనిచేస్తున్నారని, విద్యాభివృద్ధికి మరింత శ్రమించాలని జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా అన్నారు. భవిష్యత్తు మరిన్ని ఉత్తమ ఫలితాలు సాధించి ప్రోత్సాహకాలు పొందాలని ఆకాంక్షించారు. గత విద్యాసంవత్సరంలో టెన్త్, ఇంటర్లో మంచి ఫలితాలు వచ్చాయని అది స్ఫూర్తితో కొనసాగించాలని కోరారు.

**ఉపాధ్యాయుల కృషితోనే మంచి ఫలితాలు: పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి**

ఉపాధ్యాయుల కృషితోనే విద్యార్థులు ఉన్నత చదువులు,ఉద్యోగాలలో రాణిస్తున్నారని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు.జిల్లాలోని అన్ని పాఠశాలల్లోను ఉపాధ్యాయులంతా పాఠశాలల నిర్వహణ,నాణ్యమైన విద్యాబోధనకు శ్రమిస్తున్నారని, వారందరికి అభినందనలు తెలిపారు.

**శాలువాలతో సత్కరించి..**

జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న పలు మండలాల ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు, కేజీబీవీ పాఠశాలల ప్రత్యేకాధికారులు, సీఆర్‌టీలు, పీఈటీ, సర్వశిక్షా విభాగం సిబ్బందికి ఉత్తమ అవార్డులను కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, ఎంపీపీ రత్నకుమారి పంపిణీ చేశారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎస్.రత్నకుమారి, డీసీడీవో సూర్యకుమారి, ఎంఈవోలు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు తదతరులు పాల్గొన్నారు.

# జ్ఞాన జ్యోతులు.. విద్యా కాంతులు



ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన





మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అరకు క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ పీఎస్ఎన్ మూర్తి, మారేడుమిల్లి కేజీబీవీ ప్రిన్సిపాల్ మయూరి లక్ష్మి

- అట్టహాసంగా రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవం
- 196 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డుల ప్రదానం
- హాజరైన మంత్రులు బొత్స, బూడి, గుడివాడ, రాష్ట్ర విద్యాశాఖ అధికారులు

**ఏయూక్యాంపస్ (విశాఖ):** గురువులకే గురువుగా.. ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ నడయాడిన ఆంధ్ర విశ్వవిద్యాలయం వేదికగా రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ దినోత్సవం అట్టహాసంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో కట్టమంచి రామలింగారెడ్డి స్నాతకోత్సవ మందిరంలో మంగళవారం జరిగిన ఈ వేడుకలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాల నాయుడు, రాష్ట్ర పరిశ్రమల శాఖ గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య కె.హేమచంద్రారెడ్డి, ప్రధాని మోదీ ప్రసంగాన్ని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు చదివి వినిపించారు. రాష్ట్ర విద్యారంగంలో జరుగుతున్న సంస్కరణలు, తద్వారా వస్తున్న సత్ఫలితాలను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన పలువురు వివరించారు. పాఠశాల, కళాశాల, విశ్వవిద్యాలయ, సాంకేతిక విద్య, నైపుణ్య శిక్షణ విద్య విభాగాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపిన 196 మంది అధ్యాపకులకు రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా పురస్కారాలు ప్రదానం చేశారు.

**ఆకట్టుకున్న కళా ప్రదర్శనలు**

రాష్ట్ర స్థాయి గురుపూజోత్సవంలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. ముందుగా గణనాయక స్వాగత నృత్యంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.

**అభినందించిన ప్రవీణ్ ప్రకాష్**

రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ అభినందించారు. అవార్డు గ్రహీతల గ్యాలరీకి వెళ్లి వారిని పేరుపేరునా పలకరిస్తూ, శుభాకాంక్షలు తెలిపారు.

## పోలవరం నిర్వాసితులకు మేలైన పునరావాసం



సమావేశంలో మాట్లాడుతున్న అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య

**చింతూరు:** పోలవరం నిర్వాసితులకు మేలైన పునరావాసం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య అన్నారు. చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులకు పునరావాసం కల్పించడంలో భాగంగా పీడీఎఫ్ కమిటీ సభ్యులకు మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితుల కోసం ఏలూరు జిల్లా తాడ్వాయి, తూర్పుగోదావరి జిల్లా యాదవోలు వద్ద స్థలాలను పరిశీలించినట్లు తెలిపారు. కమిటీ సభ్యులతో పాటు ఇతర గ్రామస్తులు ఆయా స్థలాలను పరిశీలించి నిర్ణయం తెలిపిన తరువాత వారికి స్థలాలు కేటాయిస్తామని ఆయన తెలిపారు. పునరావాస ప్రాంతంలో నిర్వాసితులకు ఉపాధి అవకాశాల కల్పనకు కృషి చేస్తామని, గృహాలు కేటాయించడంతో పాటు విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ, రహదారి సౌకర్యాలు కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. నిర్వాసితుల అభీష్టం మేరకు ఒకే గ్రామానికి చెందిన వారు వేర్వేరు ప్రాంతాలను ఎంచుకుంటే వారికి అక్కడే పునరావాసం కల్పిస్తామని ఆయన తెలిపారు. ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఐదుసెంట్ల స్థలం కేటాయిస్తామని, పేదలకు ప్రభుత్వమే ఇళ్ల నిర్మిస్తుందని ఆయన తెలిపారు. సొంతంగా ఇల్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ 2.85 లక్షలు ఇస్తామని ఆయన పేర్కొన్నారు. చింతూరుకు సంబంధించిన నిర్వాసితుల ఇళ్ల విలువ సర్వేను వేగవంతం చేయాలని, ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా సర్వేను చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను ఆయన ఆదేశించారు. మరోవైపు మండలంలోని తులసిపాక ప్రాంతంలో తమకు పునరావాసం కల్పించాలని చింతూరుకు చెందిన గిరిజన నిర్వాసితులు కోరగా రెండు, మూడు రోజుల్లో స్థలాలు పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆయన తహసీల్దార్ సుబ్బారావును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు రమణ, విక్టర్‌బాబు, శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సిరులతల్లికి లక్ష కుంకుమార్చన



**డాబాగార్డెన్స్:** కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఘనంగా జరిగింది. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు జరిగిన కుంకుమార్చనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చింది. ప్రతి నెలా మొదటి మంగళవారం నిర్వహించే ఈ పూజా రుసుం రూ.10 వేలు. ఈ మొత్తం చెల్లించిన భక్తుల తరపున నలుగురు దంపతులను అనుమతిస్తున్నట్లు ఆలయ ఈవో కె.శిరీష తెలిపారు. ట్రస్ట్ బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

## ఘాట్‌రోడ్డు అస్తవ్యస్తం

- రెండు రోజుల వర్షానికి కోతకు గురైన కల్వర్టు
- కూలిన రక్షణగోడలు
- ప్రధాన రహదారిపైకి చేరిన మట్టి, రాళ్లు



హెయిర్‌పిన్‌బెండ్ రెండో మలుపు సమీపంలోని కోతకు గురైన కల్వర్టు

**అనంతగిరి:** గత రెండురోజులుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షానికి అనంతగిరి ఘాట్‌రోడ్డు అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపైకి భారీగా వరదనీరు, రాళ్లు, మట్టి వచ్చేసింది. దీంతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. హెయిర్‌పిన్‌బెండ్ ఒకటో మలుపు సమీపంలోని కొండచరియలు జారిపడ్డాయి. హెయిర్‌పిన్‌బెండ్ రెండో మలుపులో కల్వర్టు కోతకు గురైంది. హెయిర్‌పిన్ బెండ్ నాలుగో మలుపు సమీపంలోని రక్షణగోడలు కూలాయి. ఘాట్‌రోడ్డులో వర్షం నీరు పోయేందుకు డ్రైనేజీ వ్యవస్థ లేనందున రోడ్డు రక్షణ గోడలు దెబ్బతింటున్నాయి. ఇటీవల ఓహెచ్‌సీ కేబుల్ ఏర్పాటుకు తవ్విన గోతుల వల్ల కూడా రక్షణగోడలకు నష్టం వాటిల్లుతోంది. ఇప్పటికైనా ఎన్‌హెచ్‌- 5 అధికారులు స్పందించి, ఘాట్‌రోడ్డులో రక్షణ చర్యలు చేపట్టాలని వాహన చోదకులు కోరుతున్నారు.



హెయిర్‌పిన్‌బెండ్ మొదటి మలుపు సమీపంలో జారిపడిన కొండ చరియలు



హెయిర్‌పిన్‌బెండ్ ఐదవ మలుపు సమీపంలోని ప్రధాన రహదారిపై పేరుకుపోయిన మట్టి

## లోతట్టు ప్రాంతాలు జలమయం



అమ్మిరేఖల రహదారిపైకి వచ్చేసిన కొండవాగు నీరు



గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల వద్ద కూలిన ప్రహరీ



ముంచంగిపుట్టులో కురుస్తున్న వర్షం

**రాజవొమ్మంగిలో 25.2 ఎంఎం నమోదు**

**రాజవొమ్మంగి:** మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. లబ్బర్తి వద్ద పెద్దేరు, శరభవరం కాలువ పొంగి ప్రవహించాయి. రాజవొమ్మంగిలో 25.2 ఎంఎం వర్షపాతం నమోదు అయ్యింది. లబ్బర్తి కల్వర్టు వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు కారణంగా వాహనాల రాకపోకలకు గంటల కొద్ది ఆటంకం ఏర్పడింది. రాజవొమ్మంగి నుంచి అమ్మిరేఖల వెళ్లే రహదారిలో పెద్దేరు, చిన్నేరు పొంగి ప్రవహించాయి. ఈ కాలువ ద్వారా వచ్చిన వరద నీటికి అప్పలరాజుపేట వద్ద ఒట్టిగెడ్డ రిజర్వాయర్‌లో భారీగా వరద నీరు చేరింది.

**కూలిన పాఠశాల ప్రహరీ**

**హుకుంపేట:** మండలంలోని మంగళవారం కురిసిన భారీ వర్షానికి స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రహరీ కూలింది. భారీగా వరదనీరు చేరడంతో విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. స్టాక్ రూమ్‌లో నీరు చేరడంతో సరకులు తడిచిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న ఏటీడబ్ల్యూవో రజని పాఠశాలలో సందర్శించారు.ప్రహరీ కూలిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని ఆమె పేర్కొన్నారు.

**ముంచంగిపుట్టు:** మండలంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల వరిపొలాలు నీట మునిగాయి.మట్టి దిబ్బలు పంట పొలాల్లోకి కొట్టుకు వచ్చాయి.జర్రెల, బూసిపుట్టు పంచాయతీల్లో పలు గ్రామాలకు వెళ్లే రహదారులు బురదమయంగా మారడంతో వాహనాలు బురదలో కూరుకుపోవడంతో ప్రయాణాలు చేసే వాహనదారులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగించారు.

## ఎకరాకు రూ.10 లక్షల పరిహారం

**పోలవరం అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్‌ఆదిత్య**



గ్రామసభలో మాట్లాడుతున్న ప్రవీణ్ ఆదిత్య

**ఎటపాక:** పోలవరం నిర్వాసితులకు పునరావాస కాలనీల నిర్మాణానికి సాగు భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.10 లక్షల పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించినట్లు పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రవీణ్ ఆదిత్య ప్రకటించారు. మండలంలోని బాసవాగు, లక్ష్మీపురంలో మంగళవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజల అభిప్రాయాలను ఆయన తెలుసుకున్నారు. రామగోపాలపురం, బాసవాగు, లింగాలపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఎప్పటి నుంచో సాగుచేసుకుంటున్నందున ఆభూములు కోల్పోతున్న రైతు సమస్యలను, న్యాయమైన డిమాండ్లను పరిశీలించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతీ రైతుకు ఐదు ఎకరాల వరకు మాత్రమే పరిహారం ఇవ్వనున్నామని తెలిపారు.అడంగల్‌లో అనుభవదారుగా పేరు ఉండి, శిస్తు ఇతర ఆధారాలు ఉన్న ప్రతీ ఒక్కరికి నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు.అయితే తాము నివాసం ఉంటున్న గృహాలకు ఇంటి పట్టాలు ఇప్పించాలని బాసవాగు సభలో ప్రజలు కోరారు. ఏజెన్సీ చట్ట ప్రకారం ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనిపై తన వంతు కృషి చేస్తానని తెలిపారు. భూముల సర్వే లెక్కలు వారం రోజుల్లో పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.ఈ ప్రాంతంలో చిన్న పరిశ్రమ ఏర్పాటుకు భూములు కేటాయిస్తామని పరిశ్రమ ద్వారా ఈ ప్రాంత వాసులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని ఆయన తెలిపారు. తమ సమస్యలపై సానుకూలంగా స్పందించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఈ ప్రాంత రైతులు కృతజ్ఞతలు తెలిపారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీనివాసరావు, వెంకటరమణ,తహసీల్దార్లు పృథ్వీ, శ్రీధర పాల్గొన్నారు.

## 80 కిలోల గంజాయి పట్టివేత

**ఒకరి అరెస్టు.. మరొకరు పరారీ**

**చింతపల్లి రూరల్:** మండలంలో రామారావుపాలెం సమీపంలో 80 కేజీల గంజాయి పట్టుకున్నట్లు అన్నవరం ఎస్‌ఐ రమణ తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. బలపం పంచాయతీ వేలంజువ్వికి చెందిన కొర్ర శివ రామారావుపాలెంలో సమీపంలో గంజాయి డంప్ చేసి రవాణాకు సిద్ధంగా ఉంచాడు. దీనిపై అందిన సమాచారం మేరకు సిబ్బందితో ఎస్‌ఐ అక్కడికి చేరుకుని స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న శివను అదుపులోకి తీసుకుని విచారించారు. ఒడిశాలోని దవడపల్లికి చెందిన కిల్లో సత్తిబాబు సూచన మేరకు రవాణాకు సిద్ధం చేసినట్టు అతను చెప్పాడని ఎస్‌ఐ వివరించారు. అయితే కిల్లో సత్తిబాబు పరారీలో ఉండగా శివపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

**సీలేరులో పది కిలోలు..**

**గూడెంకొత్తవీధి:** మోటారు సైకిళ్లపై ఒడిశా నుంచి విజయవాడకు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టుకున్నట్టు సీలేరు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. వారినుంచి పది కిలోల గంజాయి, రెండు బైక్‌లు, రూ.550 నగదును స్వాధీనం చేసుకున్నారు.ఆయన కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. విజయవాడకు చెందిన షేక్ మహబూబ్ సుభాని బైక్ దొంగతనాలకు పాల్పడుతుంటాడు. ఇలా అపహరించిన బైక్‌లను సీలేరులోని చింతపల్లి క్యాంప్‌కు చెందిన వంతల మూర్తికి అప్పగిస్తుంటాడు. అతని నుంచి గంజాయి తీసుకుని విజయవాడ వెళ్తుంటాడు. ఈ నేపథ్యంలో గత మూడవ తేదీన విజయవాడలో బయలుదేరిన సుభాని, మరొక వ్యక్తి మార్గం మధ్యలో దొంగలించిన బైక్‌ను సీలేరు తీసుకువచ్చి మూర్తికి అప్పగించారు. అతని నుంచి పది కిలోల గంజాయి తీసుకుని సుభాని మరో వ్యక్తి బైక్‌పై విజయవాడ బయలుదేరారు. ఈ మేరకు సమాచారం సేకరించిన ఎస్‌ఐ ఐటీఐ జంక్షన్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. ఇరువురి వద్ద పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు సుభాని పట్టుబడగా మరో వ్యక్తి తప్పించుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. పరారీలో ఉన్న వ్యక్తి కోసం గాలిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.



పట్టుబడిన ముద్దాయి, గంజాయితో పోలీసులు



సీలేరులో గంజాయితో పట్టుబడిన నిందితులు

## క్లుప్తంగా

### పశు విజ్ఞాన బడితో రైతులకు మేలు



కించోల్డాలో పశు పోషణపై అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారి సౌజన్యదేవి

ముంచంగిపుట్టు: పశు విజ్ఞాన బడితో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని కిలగాడ పశు వైద్యాధికారి ఎం.సౌజన్యదేవి తెలిపారు. మండలంలోని బంగారుమెట్ట పంచాయతీ కించోల్డా గ్రామంలో మంగళవారం పశు విజ్ఞాన బడి నిర్వహించారు. ఆవులు,ఎద్దులు,మేకల సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం లంపీ స్కిన్ వ్యాధి నివారణకు 56 పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి సౌజన్యదేవి మాట్లాడుతూ పాడి అభివృద్ధి కోసం రైతులు పశు వైద్య సిబ్బంది సలహాలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రఘురామ్,రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

### నిర్వాసితులకు గృహ పట్టాల పంపిణీ రేపు

వీఆర్‌పురం: మండలంలోని పోలవరం ప్రాజెక్ట్ ముంపు 41 కాంటూరు పరిధిలోని కోలూరు,కొండేపూడి, తుమ్మిలేరు,పోచవరం,చొక్కనపల్లి గ్రామాలకు చెందిన గిరిజన నిర్వాసితులకు గురువారం గృహ పట్టాలను పంపిణీ చేయనున్నట్టు తహసీల్దార్ ఎస్.శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వారికి కేటాయించిన గృహాల పట్టాలను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ (బాబు) రేఖపల్లిలో అందజేయనున్నట్టు చెప్పారు.

### రోడ్డు ప్రమాదంలో యువతికి గాయాలు



చికిత్స పొందుతున్న యువతి

మాడుగుల: స్థానిక అగ్నిమాపక కేంద్రం వద్ద మంగళవారం ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో యువతికి గాయాలయ్యాయి. పాడేరు నుంచి మాడుగుల మీదుగా స్కూటీపై వస్తున్న యువతి జన్ని దాబురాను ఎదురుగా వస్తున్న బైక్ ఢీ కొట్టడంతో ఆమెకు తలపై, మోకాలుపై గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం అనకాపల్లిలో ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

# ఉత్తమ సేవలకు సత్కారం

సాక్షి, పాడేరు: విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను గురుపూజోత్సవం సందర్భంగా పాడేరు కాఫీ అతిథి గృహంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్, జిల్లా విద్యాశాఖాధికారి సలీంబాషా, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సత్కరించారు.





కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి చేతులమీదుగా సత్కారం పొందుతున్న జి.మాడుగుల ఎంఈవో చిట్టపులి బాబూరావు, మోతుగూడెం స్కూల్ కాంప్లెక్స్ సెక్రెటరీ మీనా కబ్బారావు, చింతూరు ఎంఈవో లక్ష్మీనారాయణ, పాడేరు ఏకలవ్యప్రిన్సిపాల్ ప్రభాకరరావు,మారేడుమిల్లి హెచ్‌ఎం బీఎస్.కుమార్, జి.మాడుగుల హెచ్‌ఎం పి.సుభద్ర, కిముడుపల్లి హెచ్‌ఎం ఎస్.గోపాలరాజు, జోలాపుట్టు హెచ్‌ఎం పి.నిర్మల,హుకుంపేట హెచ్‌ఎం కె.సువర్ణరాజు, తలారిసింగి హెచ్‌ఎం రీమలి జాన్, దేవరపల్లి హెచ్ఎం లండ వెంకటేశ్వర్లు, అవార్డులతో టీచర్ శ్యాంసుందర్‌బాబు, స్కూల్ అసిస్టెంట్ కొర్ర రవికుమార్, హుకుంపేట ఎంఈవో చెల్లయ్య

## సామాజిక మరుగుదొడ్లు, ఈ-ఆటోల మంజూరుకు వినతి



స్వచ్ఛాంధ్ర బోర్డు మీటింగ్‌లో సమస్యలను వివరిస్తున్న శోభ సోమేశ్వరి

అనంతగిరి: మన్యంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సామాజిక మరుగుదొడ్లు, తడి, పొడి చెత్తను సేకరించేందుకు ఈ ఆటోలను మంజూరుచేయాలని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గంధం చంద్రుడిని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరీ కోరారు. విజయవాడలోని మంగళవారం జరిగిన స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ 23వ బోర్డు మీటింగ్‌లో ఆమె పాల్గొని ఏజెన్సీలో సమస్యలు వివరించారు.

## సింహాచల దేవస్థానం ఈవోగా శ్రీనివాసమూర్తి



శ్రీనివాసమూర్తి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఈవోగా రెవెన్యూ శాఖకి చెందిన ఎస్.శ్రీనివాసమూర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం విశాఖ డీఆర్వోగా విధులు నిర్వర్తిసున్న ఆయన్ని సింహాచలం దేవస్థానానికి ఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డి మంగళవారం జీవో 1777 జారీ చేశారు. 2021 జూలై ఒకటి నుంచి ఇప్పటి వరకు విశాఖ డీఆర్వోగా శ్రీనివాసమూర్తి విధులు నిర్వర్తిస్తున్నారు. త్వరలోనే దేవస్థానం ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తానని.. అందరి సహకారంతో దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా 'సాక్షి'కి తెలిపారు. భగవంతుడికి, భక్తుడికి సేవ చేసేందుకు తనకు దక్కిన అవకాశంగా భావిస్తున్నట్టు చెప్పారు. కాగా.. గత ఏడాది ఆగస్టు రెండవ తేదీ నుంచి ఇప్పటి వరకు సింహాచలం దేవస్థానానికి శాశ్వత ఈవో లేరు. 2021 మార్చి నుంచి 2022 ఆగస్టు ఒకటవ తేదీ వరకు రెవెన్యూ శాఖకే చెందిన ఎం.వి.సూర్యకళ దేవస్థానం పర్మినెంట్ ఈవోగా విధులు నిర్వర్తించారు. ఆమె తర్వాత 2022 ఆగస్టు 2 నుంచి దేవదాయశాఖకి చెందిన ఆర్‌జేసీ డి.భ్రమరాంబ ఇన్‌చార్జి ఈవోగా పనిచేశారు. అదే ఏడాది సెప్టెంబర్ 21 నుంచి ఇప్పటి వరకు దేవదాయశాఖ ఆర్‌జేసీ వి.త్రినాథరావు ఇన్‌చార్జి ఈవోగా విధులు నిర్వర్తిసున్నారు. దేవస్థానానికి పర్మినెంట్ ఈవో లేకపోవడంతో పాలన వ్యవహారాల్లో నిర్లక్ష్యం నెలకొందని విమర్శలు వచ్చాయి. ఎట్టకేలకు పర్మినెంట్ ఈవోను నియమించడంతో ఆలయ పాలన ఓ కొలిక్కిరానుంది.

## 50 లీటర్ల సారాతో ఆరుగురి అరెస్టు



నిందితులతో జి.మాడుగుల సీఐ, ఎస్ఐ

జి.మాడుగుల: అన్నవరం ప్రాంతం నుంచి జి.మాడుగుల వస్తున్న సర్వీస్ జీపులో రవాణా చేస్తున్న 50 లీటర్ల సారాను సోమవారం రాత్రి పట్టుకున్నట్టు జి.మాడుగుల సీఐ సత్యనారాయణ, ఎస్ఐ శ్రీను తెలిపారు. అందిన సమాచారం మేరకు రచ్చపల్లిలో జీపును తనిఖీ చేసి సారాను స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. జీఎం కొత్తూరు గ్రామానికి చెందిన తాంగుల భానుప్రసాద్, సీదరి రాజ్‌కుమార్,పెద్దలంకకు చెందిన కోన రాజారావు,ఉరుము జంక్షన్‌కు చెందిన కోట పెదలక్ష్మయ్య, జి.మాడుగులకు చెందిన అబ్దుల్‌సాహెబ్, బుర్రతాడుకు చెందిన జగ్గందొర సహదేవుడులను అరెస్టు చేసి, మంగళవారం రిమాండ్‌కు తరలించినట్టు సీఐ, ఎస్ఐ తెలిపారు.

## ఏయూలో జాబ్‌మేళా రేపు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్, గైడెన్స్ బ్యూరో ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉదయం 10.30 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు తెలిపారు. డబ్ల్యూఎన్ఎస్ సంస్థలో నాన్ వాయిస్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలకు డిగ్రీ విద్యార్హత కలిగిన వారు అర్హులు. 20 ఖాళీలను భర్తీ చేస్తారు. 20 నుంచి 35 ఏళ్లు ఉండాలి. నెలకు రూ.16 వేల వేతనం అందిస్తారు. బజాజ్ క్యాపిటల్ సంస్థలో సేల్స్, టెలీ, మార్కెటింగ్ ఉద్యోగాలకు ఇంటర్, డిప్లమో, డిగ్రీ, పీజీ చేసిన వారు అర్హులు. మొత్తం 12 ఖాళీలు భర్తీ చేస్తారు. 20 నుంచి 35 ఏళ్లు ఉండాలి. వీరికి వేతనంగా రూ.10వేల నుంచి 13 వేలు అందిస్తారు. అర్హత కలిగిన వారు www.ncs.gov.in/లో వివరాలు నమోదు చేసుకుని, ఇంటర్వ్యూకు హాజరు కావాలని దొరబాబు కోరారు. ఇతర సమాచారం కోసం 96660 92491లో సంప్రదించవచ్చు.

## ఇంటిపై కూలిన భారీ చెట్టు



శరభవరం కాలనీలో ఇంటిపై పడిన చెట్టు

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం కాలనీలో ఓ పెంకుటింటిపై మంగళవారం భారీ చింత చెట్టు కూలిపోయింది. దీంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. చెట్టుకూలిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో ఆ ఇంట్లో నివస్తున్న పుట్టపల్లి బాలమ్మ, ఆమె కొడుకు పెంటారావు ప్రాణభయంతో బయటకు పరుగులు తీశారు. దీంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. దాదాపు రూ.లక్ష ఆస్తి నష్టం జరిగిందని, తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

## సమగ్ర శిక్షలో 32మందికి ఉత్తమ పురస్కారాలు



డీసీడీవో సూర్యకుమారి, పాడేరు కేజీబీవీ పీఈటీ ఎం.వెంకటలక్ష్మి, సమగ్ర శిక్ష పాడేరు మండల కో ఆర్డినేటర్ వి.జయరాజ్‌లను సత్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో అభిషేక్, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: సమగ్ర శిక్ష విభాగంలో 32 మంది జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్నారు. కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో వి.అభిషేక్,పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి వారిని ఘనంగా సన్మానించారు. ప్రశంసా పత్రం, జ్ఞాపికలు అందజేశారు. జిల్లా సమగ్ర శిక్ష డీసీడీవో సూర్యకుమారి, చింతూరు కేజీబీవీ ఎస్‌వో రమాదేవి,పాడేరు, ఎటపాక కేజీబీవీల పీఈటీలు ఎం.వెంకటలక్ష్మి,కృష్ణవేణి,అరకు సీఆర్‌టీ సుశీల,పాడేరు మండల సమన్వయకర్త వి.జయరాజ్‌తో పాటు పలు మండలాల్లోని మండల కో ఆర్డినేటర్లు,సీఆర్‌పీలు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు పొందారు.

## 103 మందికి కారుణ్య నియామకాలు

**రిక్రూట్‌మెంట్ ద్వారా 43 మంది నియామకం**



నియామక పత్రాలను అందజేస్తున్న విశాఖ కలెక్టర్ మల్లికార్జున, జేసీ విశ్వనాథన్

మహారాణిపేట: ప్రభుత్వ ఉద్యోగులు నిజాయతీ, నిస్వార్థంగా సేవలందించాలని కలెక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. పలు ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు మంగళవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో సాధారణ కారుణ్య నియామకాల కింద 70 మందికి, రెవెన్యూ శాఖలో 9 మందికి, గ్రామ సచివాలయాల్లో ముగ్గురికి, ఆర్టీసీలో 21 మందికి, రెవెన్యూ శాఖలో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్(గ్రూప్-4) ద్వారా ఎంపికైన 43 మంది జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్లకు నియామక పత్రాలు అందజేసినట్లు కలెక్టర్ తెలిపారు. వీరందరికీ కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపి.. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని సూచించారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో మొత్తం 436 మందికి నియామక పత్రాలు అందజేసినట్లు వెల్లడించారు. జాయింట్ కలెక్టర్ కె.ఎస్. విశ్వనాథన్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు ప్రజలకు సేవ చేయాలని.. సమయపాలన పాటించాలన్నారు.

డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, కలెక్టరేట్ కార్యాలయ పరిపాలన అధికారి కె.ఈశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



### పెన్షనర్ల పే రివిజన్‌కు కృషి

సీతంపేట: ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక పౌరగ్రంథాలయంలో మంగళవారం ఉమ్మడి విశాఖ జిల్లా ఆత్మీయ సమావేశం జరిగింది. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుప్పిలి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడో వేతన సంఘం సిఫార్సులకు అనుగుణంగా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లకు పే రివిజన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం సుమారు 4 లక్షల మంది బీఎస్ఎన్ఎల్ పెన్షనర్లు 2017 నుంచి ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యసభ ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతి పత్రం అందజేయగా.. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. పెన్షన్ రివిజన్‌పై ఇదివరకే కేంద్ర కమ్యూనికేషన్ మంత్రికి లేఖ రాశానని గుర్తు చేశారు. మరోసారి కేంద్ర మంత్రితో సమావేశమై పే రివిజన్ అమలుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.పట్నాయక్, సీనియర్ సభ్యులు వి.ఆర్.కె.శర్మ, ఆర్.ఎ స్.ఎస్.మూర్తి, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

### ఘనంగా సీమంతాలు

వీఆర్‌పురం: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైస్ ఎంపీపీ ముత్యాల భవాని, ఏఎస్‌డీఎస్ సంస్థ డైరెక్టర్ ఉండవల్లి గాంధీబాబు అన్నారు. వీఆర్‌పురం ఎస్టీకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు ఘనంగా సీమంతాలు నిర్వహించి, పోషకాహార పదార్థాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.నాగలక్ష్మి,సర్పంచ్ సోడె నరసమ్మ,ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రామలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామాల్లో సమస్యల పరిష్కారమే లక్ష్యం



గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కొట్టగుళ్ళ భాగ్యలక్ష్మి



కొత్తవీధి గ్రామంలో సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

**ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి**

పాడేరు రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దశల వారీగా వాటిని పరిష్కరిస్తోందని ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పాలనకు దేశమంతటా ప్రశంసలు లభిస్తున్నాయని చెప్పారు. మండలంలోని చింతలవీధి గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. 272 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గణంకాలతో సహా లబ్ధిదారులకు వివరించారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాల హయాంలో ఎన్నడూ చూడని అభివృద్ధి జగనన్న పాలనలో చూశామన్నారు. సంక్షేమ పథకాల అమలు వల్ల రాష్ట్ర ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని చెప్పారు. సంక్షేమ పథకాలతో ప్రజలకు చేకూరుతున్న ప్రయోజనాన్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని చెప్పారు. రానున్న ఎన్నికల్లో అందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంతాల సీతమ్మ, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ తామర సురేష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి మంగ్లన్నదొర, మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఎం.సరస్వతి, మార్కెట్ కమిటీ చైర్మన్ కూతంకి సూరిబాబు, వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ జిల్లా అధ్యక్షుడు గబ్బాడ చిట్టిబాబు, వైస్‌ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, గొల్లోరి నీలకంఠం, ఎంపీటీసీలు దూసూరి సన్యాసిరావు, కె.నరసింహమూర్తి, ఎల్.రామకృష్ణపాత్రుడు. సల్లా చిట్టమ్మ పాల్గొన్నారు.

**సమస్యల పరిష్కారానికే గడపగడపకు.. : ఎమ్మెల్యే ధనలక్ష్మి**

రాజవొమ్మంగి: సమస్యలను గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు. రాజవొమ్మంగి మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ కొత్తవీధి, అమ్మిరేఖల, కిమ్మిలిగెడ్డ గ్రామాల్లో మంగళవారం ఆమె గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి, దాదాపు 255 గడపలను సందర్శించారు. సంక్షేమ పథకాలు ఎవరెవరికి అందాయో ఆరా తీశారు. ఇంకా పథకాలు అందక ఇబ్బంది పడుతున్న వారు ఎవరైనా ఉన్నారా అని తెలుసుకొన్నారు. ప్రజల నుంచి ఈ మేరకు అర్జీలు స్వీకరించారు. తమ గ్రామాలను అనుకుని ప్రవహిస్తున్న చీకుధార జలపాతం ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని గ్రామస్తులు కోరారు. కొత్తవీధిలో సీసీ రోడ్డు కావాలని స్థానికులు కోరారు. రాజవొమ్మంగి నుంచి అమ్మిరేఖల వరకు ఇది వరకు రూ. 22 లక్షల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్ కొంత మేర అసంపూర్తిగా మిగిలిపోయిందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకు రాగా వెంటనే రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యేందుకు చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నాలుగేళ్లలో ప్రతి కుటుంబానికి రూ.1,48,000 నుంచి రూ. 2 లక్షల విలువ చేసే సంక్షేమ పథకాలు అందాయని చెప్పారు. రానున్న రోజుల్లో కూడా జగనన్నే సీఎం అని ఎమ్మెల్యే గిరిజన మహిళలను ఉత్తేజ పరచారు. అమ్మిరేఖలలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, వైస్ ఎంపీపీ చప్పా చంద్రరాణి, ఎంపీటీసీలు చుండ్రు లోవకుమారి, గంగదుర్గ, నాయకులు చీడిపల్లి అప్పారావు, కుశరాజు, ఎల్లెం రాంబాబు, రవి, కామేష్, సర్పంచ్‌లు గణలక్ష్మి, శుభలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ బాజిలాల్, ఎస్‌హెచ్‌వో గోపీ నరేంద్ర ప్రసాద్, ఉపాధి ఏపీవో సురేష్‌కుమార్, వెలుగు ఏపీఎం ఆదినారాయణరావు, ఏఈలు వీరభద్రరావు, శ్రీనివాస్, సీడీపీవో దేవమణి పాల్గొన్నారు.

## శారదానదిలో పడి వృద్ధుడి మృతి



నీటిలో తేలియాడుతున్న వృద్ధుడి మృతదేహం

బుచ్చెయ్యపేట: మండలంలోని వడ్డాది శారదానదిలో వృద్ధుడు మృతిదేహం బయటపడింది. మృతుడు మాడుగుల మండలం వీరవల్లికి చెందిన సయ్యపురెడ్డి నరశింహదొర(70)గా స్థానికులు గుర్తించారు. మంగళవారం మధ్యాహ్నం వడ్డాది రాళ్లుకట్టు వద్ద శారదా నదిలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. 100 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఎస్ఐ కె. కుమారస్వామి తమ సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఉదయం గ్రామంలో బహిర్భూమికి వెళ్లాడని, ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతుకుతున్నామని, ఇంతలో విగతజీవిగా మారడంతో విలపించారు. మృతుడికి భార్య నాగమణి, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

## ట్రాక్టర్‌పై నుంచి జారిపడి డ్రైవర్ మృతి

యలమంచిలి: మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌పై నుంచి అదుపుతప్పి కింద పడిపోవడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన యలమంచిలి మున్సిపాలిటీ యానాద్రి కాలనీ వద్ద మంగళవారం చోటు చేసుకుంది. పట్టణ ఎస్సై పాపినాయుడు వివరాల ప్రకారం.. యలమంచిలి ఫైరాఫీస్ కాలనీకి చెందిన డ్రైవర్ కాశీందేవుని వీరునాయుడు(42) మట్టి లోడు ట్రాక్టర్‌ను రోడ్డు పక్కన గుంతలో అజాగ్రత్తగా నడపడటంతో దానిపై నుంచి కింద పడిపోయాడు. వెంటనే ట్రాక్టర్ వెనుక చక్రాల కింద నలిగిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనే యువకుడి మృతి

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెం-ముద్దుర్తి జంక్షన్‌ల మధ్య అనకాపల్లి రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతోనే యువకుడు మృతి చెందినట్టు చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మండలంలోని అడ్డూరు గ్రామానికి చెందిన మృతుడు సానబోయిన దేముడుబాబు(25) అదే గ్రామానికి చెందిన యలమంచిలి శ్రీనివాసరావుకు చెందిన లారీలో డ్రైవర్‌గా పని చేస్తున్నాడన్నారు. ఎప్పటిలాగే సోమవారం ఉదయం 9 గంటలకు లారీ తీసుకుని వెళ్లాడని, సాయంత్రం ముద్దుర్తి కొత్తపల్లిలో ఇటుకల లోడు కోసం వెళ్లాడన్నారు. ఈ క్రమంలో లారీకి డీజిల్ కోసం నంబారువానిపాలేనికి చెందిన తన స్నేహితుడు నంబారు దేముడునాయుడు బైకును తీసుకుని వెంకన్నపాలెం వైపునకు వస్తుండగా ప్రమాదానికి గురయ్యాడని పేర్కొన్నారు. మృతుడు తండ్రి దాలినాయుడు ఫిర్యాదు మేరకు ఐపీసీ 304ఎ (హిట్ అండ్ రేన్) సెక్షన్ కింద కేసు నమోదు చేశామని, ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం సీసీ ఫుటేజీని పరిశీలిస్తున్నామని తెలిపారు.